

వర్ధమానుకోటలో ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధ దంపతులు

## ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు

నాగారం, నవంబర్ 24 : వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు వేసేలా ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకునేందుకు నాగారం మండలంలో 55 మంది దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం దివ్యాంగులు 9 మంది, వృద్ధులు 41 మంది ఇంటి వద్ద తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు మండల పోలింగ్ అధికారి జలంధర్ తెలిపారు. ఓటు వేసే విధానాన్ని పూర్తిగా వీడియో రికార్డింగ్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నరసింహారావు, శేఖర్, పోలింగ్ ఏజెంట్లు పొదిల రమేశ్, చిల్లర చంద్రమౌళి, కన్నెబోయిన వెంకటభిక్షం, జాజుల వీరయ్య, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.



వర్ధమానుకోటలో దివ్యాంగుడు సోమన్న

# రైతు జీవితాలను ఆగం చేసే కాలనాగు కాంగ్రెస్ పార్టీ

- ఆ పార్టీకి ఓటేస్తే మళ్లీ కరెంట్ కష్టాలే..
- సీఎం కేసీఆర్ సారథ్యంలోనే పచ్చని పంటలు, అన్ని వర్గాల సంక్షేమం
- సేవకుడిగా పని చేస్తున్నా మరోమారు ఆశీర్వదించండి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ తుంగతుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



తుంగతుర్తి : వెలుగుపల్లిలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను అభిమానంతో ఎత్తుకొస్తున్న జనం

తుంగతుర్తి, నవంబర్ 24 : కాంగ్రెస్ పార్టీ చెప్పే గ్యారెంటీ లేని వాగ్దానాలు నమ్మి ప్రజలు మోసపోవద్దని బీఆర్ఎస్ తుంగతుర్తి నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. రైతుల నోట్ల మన్ను కొట్టే విధంగా రైతుబంధు ఆపాలన్న వారిని ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మండలంలోని వెలుగుపల్లి, సింగారంతండా గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. చేసిన అభివృద్ధిని చూసి ఆదరించి గెలిపిస్తే నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు ఓట్లు వేస్తే గెలవగానే ఛత్తీస్‌ఘడ్, ఢిల్లీలో తిరుగుతారని, ప్రజా సమస్యలను పట్టించుకోరన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు మళ్లీ వస్తాయని ఇన్వర్టర్లు, జనరేటర్లు పెట్టుకోవాల్సిన దుస్థితి తలెత్తుతుందని చెప్పారు. రైతు బంధును ఆపాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన వారిని గ్రామాల్లో తిరుగనివ్వద్దని పిలుపునిచ్చారు. పదేండ్లుగా పండుగగా మారిన వ్యవసాయాన్ని అధోగతి పాలు చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గ్రామాల్లో మిగిలిన పనులు పూర్తి కావాలంటే మరోమారు తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండగాని కవితారాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలంయాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కేతిరెడ్డి గోపాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరమ్ మండలాధ్యక్షుడు నల్లు రామచంద్రారెడ్డి, గొట్టిపర్తి ఎంపీటీసీ కేతిరెడ్డి లతావిజయ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పులుసు యాదగిరిగౌడ్, వెలుగుపల్లి సర్పంచ్ మామిడి వెంకన్న, ఎంపీటీసీ మట్టపల్లి కవితాకుమార్, కేశవపురం ఎంపీటీసీ ఎలెజర్, ఉప సర్పంచ్ మోదాల పరమేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లెపాక రాములు, కేశవాపురం సర్పంచ్ మిర్యాల అనితా జనార్దన్, గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకన్న, వార్డు సభ్యులు నిర్మల, ఎల్లమ్మ, వెంకటనర్సు, ఎస్.కె.యాకూబ్, యాదగిరి, గుడిపాటి వీరయ్య, జలంధర్ పాల్గొన్నారు.



తుంగతుర్తి : వెలుగుపల్లి ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

### సేవకుడిగా పని చేస్తున్నా మరోమారు గెలిపించండి

అర్వపల్లి : నిత్యం ప్రజల మధ్య ఉంటూ.. ప్రజల కష్టాలను తీరుస్తూ సేవకుడిగా పని చేస్తున్న తనను మరోమారు ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ప్రజలను కోరారు. అర్వపల్లి మండలం పర్సాయపల్లి, జాజిరెడ్డిగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 30న బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి మరోమారు తనను ఆశీర్వదిస్తే తుంగతుర్తిని అన్ని రంగాల్లో ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఒకప్పుడు ఏడారిగా ఉన్న నియోజక వర్గం ఇప్పుడు ఎక్కడో 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలతో సస్యశ్యామలమై పచ్చని పంట పొలాలతో భూమి మోయలేనంత ధాన్యం పండుతున్నట్లు చెప్పారు. గోదావరి జలాల ద్వారా 95 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుందన్నారు. మరింత అభివృద్ధి కోసం మరోమారు కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. జాజిరెడ్డిగూడెంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ.. తుంగతుర్తిలో కిశోర్‌కుమార్, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందుతున్నట్లు చెపారు. కక్షలతో రగిలిపోయిన తుంగతుర్తి నియోజక వర్గం ఎమ్మెల్యే కిశోర్ పాలనలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవిస్తున్నట్లు తెలిపారు. కిశోర్‌మార్‌ను 50 వేల మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. సర్వేలన్నీ బీఆర్ఎస్‌కే అనుకూలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, మండల గ్రంథాలయ చైర్మన్ పి.యుగేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్, జిల్లా నాయకులు మొరిశెట్టి ఉపేందర్, బొడ్డు రామలింగయ్య, ఎంపీటీసీ గీత పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు

తుంగతుర్తి, నవంబర్ 24 : తిరుమలగిరి పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు సుమారు 50 మంది ఎమ్మెల్యే కిశోర్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బండ మహేశ్, పోలెపాక మురళి, స్వామి, లక్ష్మయ్య, భిక్షం, కొండగడుపుల ముత్తయ్య, సోమయ్య, నాగయ్యతో పాటు పలువురు నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# ఎమ్మెల్యే కిశోర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఇంటింటి ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు



మోత్కూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటయ్య

మోత్కూరు, నవంబర్ 24 : ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను మోత్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య కోరారు. పట్టణంలోని అంగడిబజార్, సుందరయ్యకాలనీ, ప్రధాన రహదారి వెంట ఇంటింటి ప్రచారం చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పనకబండ గ్రామంలో సర్పంచ్ బత్తిని తిరుమలేశ్, దత్తప్పగూడెంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన కంచర్ల అశోక్ రెడ్డి, పాటిమట్లలో నార్మాక్స్ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, ఆరెగూడెంలో మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాకూబ్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



అడ్డగూడూరులో డమ్మీ ఈవీఎం ద్వారా కారు గుర్తుపై అవగాహన కల్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# తుస్సుమన్న కాంగ్రెస్

## రేవంత్ సభల్లో ఖాళీ కుర్చీలు

- ఉమ్మడి జిల్లా పరిధిలో మూడు చోట్ల జనం లేక వెలవెల
- ఐదారుగంటల ఆలస్యంగా రాక
- వచ్చామా... వెళ్లామా అన్నట్లుగా వెనుదిరిగిన జనం
- సభల పేరుతో పంతం నెగ్గించుకున్న రేవంత్‌రెడ్డి
- సీనియర్లకు ఇష్టం లేకున్నా నల్లగొండలో పర్యటన

నల్లగొండ ప్రతినిధి, నవంబర్24(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్, సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోజరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార సభల్లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయితే వాస్తవంగా రేవంత్ రెడ్డి హెలికాప్టర్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలోని సభల్లో పాల్గొనాల్సి ఉంది. వాతావరణం అనుకూలిం చకపోవడంతో హెలికాప్టర్‌లో రావడం సాధ్యం కాలేదు. హెలి కాప్టర్‌లో పర్యటనకు అనుకూలంగా లేకపోయినా జిల్లా సీనియర్లను కాదని నల్లగొండలో అడుగుపెట్టాలన్న ఛాలెంజ్‌తో రోడ్డు మార్గంలో బయల్దేరి వచ్చారు. అన్ని చోట్ల కూడా రేవంత్‌రెడ్డి పర్యటన ఐదు నుంచి ఆరు గంటల ఆలస్యంగా కొనసాగింది. దాంతో ఆయన ప్రసంగించే సమయానికి అన్ని చోట్ల మెజార్టీగా ఖాళీ కుర్చీలు దర్శనం ఇచ్చాయి. నకిరేకల్‌లోని ఇండోర్ స్టేడియంలో మధ్యాహ్నం 12 గంటలకు జరగాల్సిన సభ కోసం వచ్చిన జనం రెండు గంటల వరకు కూడా రేవంత్‌రెడ్డి అడ్రస్ లేకపోవడంతో తిరుగుముఖం పట్టారు. వచ్చిన వాహనాలన్నీ తిరిగి ఊర్ల బాట పట్టాయి. తర్వాత సాయంత్రం 4 గంటలకు వస్తాడని చెప్పి జనాన్ని పోకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే విసిగిపోయిన జనం తమను తీసుకువచ్చిన వాహనాల్లో ఇంటిబాట పట్టారు. తీరా సాయంత్రం 4.47గంటలకు రేవంత్‌రెడ్డి సభా ప్రాంగణానికి చేరుకునే సరికి మెజార్టీ భాగం వెళ్లిపోయారు. తర్వాత తుంగతుర్తి నియోజకవర్గ సభ తిరమలగిరిలో మధ్యాహ్నం ఒంటి గంటకు జరగాల్సి ఉంది. ఈ సభకు రేవంత్‌రెడ్డి సాయంత్రం ఆరు గంటలకు చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ కోసం వచ్చిన జనం అంతసేపు వేచి చూడలేక వెళ్లిపోయారు. దాంతో రేవంత్‌రెడ్డి వచ్చే సమయానికి సభలో పార్టీ నేతలు, కార్యకర్తలు, స్థానికులే సభలో కనిపించారు. ఆలేరు నియోజకవర్గ సభ మధ్యాహ్నం 2 గంటలకు అని చెప్పి సాయంత్రం ఏడు గంటల వరకు రేవంత్ రెడ్డి అడ్రస్ లేరు. దాంతో జనం ఐదు గంటల వరకే మెజార్టీ భాగం వెళ్లిపోయారు. అయినా సరే సాయంత్రం 7.56 గంటలకు రేవంత్‌రెడ్డి ఆలేరుకు చేరుకున్నారు. దాంతో ఇక్కడ ఖాళీ కుర్చీలతోనే రేవంత్‌రెడ్డి తన ఉపన్యాసం కొనసాగించాల్సి వచ్చింది. ఇక అన్ని చోట్లా సభలకు వచ్చిన జనం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ కనిపించారు. సభ ఎప్పుడో అని చెప్పి ఐదారు గంటల ఆలస్యంగా రావడం ఏంటీ... రేవంత్‌రెడ్డి తీరుపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు ఇస్తున్నామని చెప్పి రేవంత్‌రెడ్డి వచ్చే వరకు అక్కడే ఉండాలని బలవంతం చేయడమేంటని అన్ని చోట్ల కామన్ చర్చ వినవచ్చింది. జనం ఓపికను పరీక్షించేలా సాగిన రేవంత్‌రెడ్డి పర్యటన అభ్యర్థులకు ఎంత మంచి చేస్తుందో లేదో కానీ... ప్రజల్లో మాత్రం లేని వ్యతిరేకతను తెచ్చిపెట్టుకున్నట్లైందన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో సాగుతుండడం విశేషం.

### కాంగ్రెస్ ఆలేరు విజయభేరి వెలవెల

యాదగిరిగుట్ట, నవంబర్ 24 : యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ ఆలేరు విజయభేరి సభ జనంలేక వెలవెలబోయింది. ఒకవైపు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగానే ప్రజలు వెనుదిరిగారు. దీంతో సభలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.రేవంత్‌రెడ్డి మాట్లాడే సమయంలో 3 వేల మంది కూడా కనిపించలేదు. 50 వేల మందిని తరలించాలని భావించిన కాంగ్రెస్ శ్రేణులు కేవలం 13 వేల మందిని తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రసంగ సమయంలో జనం పట్టించుకోలేదు. పాతచింతకాయ మాటలే ఉన్నాయని గుసగుసలాడారు.